ప్రజాశక్తి
శనివారం 18 జనవరి 2025
I



పోటెత్తిన పర్యాటకులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతంలో పర్యాటకులు పోటెత్తారు. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో పర్యాటకులతో సందర్శిత కేంద్రాలు కిక్కిరిసి పోతున్నాయి. ఉదయం మంచు అందాల నడుమ పర్యాటకులు గడుపుతూ మధ్యాహ్న వేళలో జలపాతాల చెంత సరదా స్నానాలతో ఆనందంగా గడిపారు. చాపరాయి జలవిహారి, అంజోడ సిల్క్ ఫారం పీనరిలో సెల్ఫీలు తీసుకుంటూ కుటుంబ సమేతంగా పర్యాటకులు ఆనందంగా గడిపారు.



చాపరాయి వద్ద పర్యాటకులు



సమస్యలు పరిష్కరించాలని

ఉపాధి హామీ కూలీల నిరసన

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు : సమస్యలను పరిష్కరించాలని మండలంలోని వనుగుమ్మ పంచాయతీ వనగుమ్మ గ్రామం లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీల శుక్రవారం పని ప్రదేశంలోని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం లో భాగంగా 250 రోజులు కల్పించి, రోజువారి కూలి 600 రూపాయలు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి పని ప్రదేశం లో మెడికల్ కిట్, టెంటు, పని ప్రదేశంలో తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పనిముట్లు ఉచితంగా సరఫరా చేయాలని కోరారు. 15 రోజుల్లో వేతనాలు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో ప్రమాద బీమా సౌకర్యంతో పాటు మెడికల్ కిట్లు, టెంటు, పనిముట్లు ఇచ్చేవారని ఎన్డీఏ ప్రభుత్వం ఎటువంటి సౌకర్యం అందించలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ చండల్, ఎస్ సంతన్న, ఎన్ డుంబురు, ఎస్.సుఖ్ దేవ్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

స్కూల్ శానిటేషన్, మిడ్డేమీల్స్ కార్మికులకు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- రాజకీయ వేధింపులు ఆపి ఉద్యోగ భద్రత కల్పించాలి
- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్



కార్యక్రమంలో పాల్గొన్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

ప్రజాశక్తి-విఆర్.పురం

స్కూల్ శానిటేషన్ కార్మికులు, మధ్యాహ్న భోజన కార్మికులను టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయ వేధింపులతో తొలగించే ప్రయత్నం చేస్తుందని, వేతనాలను సక్రమంగా చెల్లించకుండా ఇబ్బందులు గురి చేస్తున్నారని సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ అన్నారు. ప్రభుత్వం తక్షణమే పెండింగ్ వేతనాలు చెల్లించి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మండలంలోని రేఖపల్లిలో ఏఎస్డిఎస్ కార్యాలయంలో సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం యూనియన్ నాయకులు వరలక్ష్మి అధ్యక్షతన శానిటేషన్, మిడ్డే మీల్స్ వర్కర్ల సమావేశం జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు స్కీమ్ వర్కర్లు ఆందోళనలు చేస్తుంటే ఒక మూడు నెలలు ఆగండి రానున్నది మా ప్రభుత్వమే అన్ని సమస్యలు పరిష్కారం చేస్తామని భరోసా ఇచ్చిన కూటమి నేతలు, ఎన్నికల్లో గెలిచిన తర్వాత కార్మికులను రాజకీయ కారణాలతో తొలగించడం దుర్మార్గమని పేర్కొన్నారు. వేతనాల బడ్జెట్ కొరకు పోరాటం చేసి రాష్ట్ర ప్రభుత్వం నుండి బడ్జెట్‌ని సాధించుకుంటే, జిల్లా అధికారులు కార్మికుల అకౌంట్స్‌కు వేతనాలు వేయడానికి రోజుల తరబడి వేచి చూడవలసిన పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. శానిటేషన్ కార్మికులకు నవంబర్ నెల వరకు ఇవ్వాల్సిన వేతనాలు నేటికీ పూర్తిస్థాయిలో పడలేదన్నారు. అధికారులు తక్షణమే స్పందించి కార్మికులందరికీ పెండింగ్ వేతనాలు చెల్లించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులందరూ ఐక్యంగా ఉండి ఒకరికి సమస్య వచ్చినా అందరూ ఆందోళనకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు పులి సంతోష్ కుమార్, సుబ్బారావు, కార్మికులు శైలజ, పుణ్యవతి, రమాదేవి, జ్యోతి, వెంకమ్మ, శాంతకుమారి, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలను పరిష్కరించాలి

- సిపిఎం సర్పంచ్ త్రినాథ్ - దొరగుడలో పర్యటన

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు :మండలంలోని లక్ష్మీపురానికి చెందిన చివరి గ్రామమైన దొరగుడా గ్రామంలో స్థానిక సిపిఎం సర్పంచి కొర్ర త్రినాథ్ శుక్రవారం సందర్శించారు. ఆ గ్రామంలో పీఎం జన్మన్ ప్రత్యేక నిధులతో రహదారి నిర్మాణాలు చేపట్టే పనులను పరిశీలించేందుకు వెళ్లి గ్రామస్తులతో సమావేశమై గ్రామ సమస్యలపై ఆరా తీశారు. ఏఓబి సరిహద్దు ప్రాంతంలో ఉన్న దొరగుడ గ్రామంలో కనీస సౌకర్యాలైన తాగునీరు, రహదారి, విద్య, వైద్యం విద్యుత్ వంటి సమస్యలతో బాధపడుతున్నామని సర్పంచ్‌కు ఆ గ్రామస్తులు విన్నవించుకున్నారు. ఈ విషయంపై సర్పంచి కొర్ర త్రినాథ్ మాట్లాడుతూ, దొరగుడ గ్రామంలో విద్యుత్ సరఫరా చేసేందుకు పీఎం జన్మన్ కింద ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించాలని, అంగన్వాడీ కేంద్రం మంజూరు చేయాలని, పాఠశాల భవనం నిర్మాణం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు మల్టి పర్పస్ కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వి.సాదురామ్, ఉప సర్పంచ్ సత్యం, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తుల సమస్యలను తెలుసుకుంటున్న సిపిఎం సర్పంచ్ త్రినాథ్

పివిటిజిల ఇళ్ల నిర్మాణం సకాలంలో పూర్తి

అధికారులను ఆదేశించిన ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం



సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం, చిత్రంలో సబ్ కలెక్టర్ కల్పశ్రీ

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని పివిటిజిలకు మంజూరైన గృహాల నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం సంబంధిత అధికారులను ఆదేశించారు. పిఎం జన్‌మన్ పథకం ద్వారా పివిటిజిలకు మంజూరైన గృహాల నిర్మాణం పురోగతిపై శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏడు మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు, ఇంజనీరింగ్ అధికారులు, గ్రామ సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీతో కలిసి ఐటిడిఎ పిఒ సింహాచలం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏడు మండలాల్లో సచివాలయాల వారీగా పివిటిజిలకు మంజూరైన గృహాలు, ఎన్ని పనులు ప్రారంభించినదీ ఆరా తీశారు. మంజూరైన గృహాలకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సర్వేయర్లు కలిసి జాయింట్ సర్వే నిర్వహించాలని, సర్వేని ఈ నెల 30 నాటికి పూర్తి చేయాలని సూచించారు. పిఎం జన్‌మన్ పథకం పనులు పూర్తి చేసే విధంగా ఒక ప్రొఫార్మ్ తయారు చేసి అందజేయడం జరుగుతుందని చెప్పారు. ఈ పథకం కింద మంజూరైన గృహాల నిర్మాణ పనులు ఫిబ్రవరి 15 నాటికి అన్ని మండలాల్లో ప్రారంభించాలని ఆదేశించారు. పెండింగ్లో ఉన్న విద్యుత్, తాగునీటి పనులు పూర్తి చేయాలన్నారు. మారుమూల గ్రామాల్లో సెల్ టవర్ల మంజూరు, వాటి నిర్మాణంపై ఐటిడిఎ పిఒ ఆరా తీశారు.

రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ జన్‌మన్ పథకం ద్వారా పివిటిజిలకు మంజూరైన గృహాలకు రెవెన్యూ శాఖ పరంగా నిబంధనల ప్రకారం పొజిషన్ సర్టిఫికెట్లు పరిశీలించి మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తహశీల్దార్లు పి.రామకృష్ణ, సిహెచ్.శ్రీనివాసరావు, కె.సూర్యనారాయణ, కె.సత్యనారాయణ, వేణుగోపాల్, బాలాజీ, ఎంపీడీవోలు శ్రీనివాసరావుదొర, రత్నకుమారి, యాదగిరి ఈశ్వరరావు, విశ్వనాథ్, ఇంజనీర్లు ఐ.శ్రీనివాసరావు, గాబ్రియేలు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు చైతన్య, గౌతమి, పి.వెంకటరమణ, సుబ్బారావు, మల్లికార్జునరావు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, గ్రామ సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన కల్పించండి

- జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు : రహదారి భద్రతపై వాహన చోదకులకు అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్ సూచించారు. శుక్రవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో భద్రతా మాసోత్సవాలను ఆయన ప్రారంభించారు. రహదారి భద్రతా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 17వ తేదీ నుండి ఫిబ్రవరి 15 వరకు జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు జరుగు తాయన్నారు. వాహన దారులు తగిన భద్రతా ప్రమాణాలు పాటించాలని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ప్రమాదాలు జరిగిన వెంటనే గోల్డెన్ అవర్లో ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తే ప్రాణాపాయం తప్పుతుందన్నారు. ప్రమాదాలు జరిగినపుడు సకాలంలో స్పందించాలని సూచించారు. ద్విచక్రవాహన దారులు హెల్మెట్లు ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ.కె. పద్మలత, జిల్లా రవాణా అధికారి లీలా ప్రసాద్, రహదారులు భవనాల శాఖ ఇఇ బాల సుందర బాబు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జమాల్ బాషా, రవాణాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్‌ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-పాడేరు : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ దివస్ కార్యక్రమాన్ని న్విహించాలని జాయింట్ కలెక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేసారు. దేశంలోనే అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా ఏపీని తీర్చి దిద్దాలనే లక్ష్యంతో 12 నెలలకు 12 థీమ్లుతో ఈ ప్రోగ్రాం నిర్వహిస్తారన్నారు. మండల ప్రత్యేకాధికారులు స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొనాలని స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ. కె.పద్మావతి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని ఈనెల 18న మూడో శనివారం చేపట్టే స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమం విజయంతం చేయాలని ఎంపీడీఓ లవ రాజు పిలుపునిచ్చారు. మంచి నీటి ట్యాంక్లు శుభ్రం, క్లోరినేషన్, కాలువలు శుభ్రపరచాలన్నారు. కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపిడిఓ కోరారు.



ముఖ్య కార్యదర్శికి జ్ఞాపికను అందిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

మత్స్య లింగేశ్వర స్వామిని దర్శించుకున్న
తమిళనాడు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని మఠం పంచాయతీ ప్రముఖ శైవ క్షేత్రం మత్స్య గుండం మత్స్య లింగేశ్వర స్వామిని శుక్రవారం తమిళనాడు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి గోపాల్ కుటుంబ సమేతంగా దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం మత్స్య గుండం వద్ద వున్న మత్స్యాలకు ఆహారం అందించారు. ఆలయ చరిత్ర విశిష్ట తను స్థానికులను అడిగి తెలుసుకున్నారు, ఆలయ కమిటీ ప్రతినిధులు సన్మానించి, ఆలయ చరిత్ర పుస్తకాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మఠం శాంత కుమారి, ఆలయ కమిటీ ప్రతినిధులు టి అప్పారావు, సూర్యనారాయణ నాయుడు, సొమెలి సింహచలం, పాంగి మత్స్య కొండబాబు, అల్లంగి బాలయ్య, అల్లంగి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

యువతకు ప్రముఖ కంపెనీల్లో అవకాశాలు

ప్రజాశక్తి-పాడేరు:ప్రధానమంత్రి ఇంటర్న్ షిప్ కార్యక్రమం ద్వారా జిల్లాలోని యువతకు ప్రముఖ పరిశ్రమలలో ఇంటర్న్ షిప్ అవకాశాలు కల్పించడానికి చర్యలు తీసుకున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారిణి పి.రోహిణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా పదవ తరగతి, పాలిటెక్నిక్, ఐటీఐ, బీఏ, బీఎస్సీ, బీఫార్మసీ, బీబీఏ వంటి డిగ్రీ పూర్తి చేసి 21 నుండి 24 సంవత్సరాల వయసు కలిగిన నిరుద్యోగ యువతకు స్టైఫెండ్ కింద నెలకు అయిదారు వేల రూపాయలు చెల్లిస్తూ ఏడాది పాటు ఇంటర్న్ షిప్ కల్పిస్తామని వివరించారు. ఆ సమయంలో భీమా సౌకర్యం, పీఎం జీవన్ జ్యోతి, బీమా యోజన, పీఎం సురక్షా బీమా యోజన లాంటి సౌకర్యాలు అందిస్తామన్నారు. ప్రధానమంత్రి ఇంటర్న్ షిప్ పథకం కింద లబ్ది పొందదలచిన అభ్యర్థులు వెబ్ సైట్ లో నమోదు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.8 లక్షల మించి ఉండ రాదనీ, ప్రభుత్వ ఉద్యోగం కలిగి ఉండ రాదనీ తెలిపారు. పూర్తి వివరాలకు 9988853335, 8712655686, 8790117279 నంబర్లలో సంప్రదించవచ్చని ఆమె సూచించారు.

20న చింతపల్లి మండల సమావేశం

ప్రజాశక్తి-చింతపల్లి: ఈ నెల 20న చింతపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపిడిఓ యు.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సమావేశానికి మండల ప్రాదేశిక సభ్యులు(ఎంపిటిసి), సర్పంచులు, మండల పరిధి అధికారులు నివేదికలతో సర్వసభ సమావేశానికి హాజరు కావాలని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

ఎంఆర్‌పి కంటే అధిక ధరలకు మద్యం అమ్మకం

రాజేంద్రపాలెం వైన్‌షాప్‌లో నిలదీసిన వినియోగదారులు

ప్రజాశక్తి-కొయ్యూరు

కొయ్యూరు మండల కేంద్రం రాజేంద్రపాలెంలోని కులశేఖర్ వైన్ షాప్‌లో ఎంఆర్‌పి ధర కంటే రూ.20 అదనపు ధరలకు విక్రయించడంపై బుధవారం రాత్రి 8 గంటల సమయంలో వినియోగదారులు నిలదీశారు. వైన్ షాపు యజమానితో కస్టమర్స్ వాగ్వివాదానికి దిగారు. ప్రభుత్వ నిబంధన మేరకు ఎంఆర్‌పి ధరలకే అమ్మాల్సిన మద్యం దుకాణాల యజమానులు పండగ మూడు రోజులు అధిక ధరలకు విక్రయిస్తున్నారని ప్రశ్నించారు. బార్ నుంచి మద్యం తీసుకొచ్చి ఆ ధరకు అదనంగా రూ.20 కలిపి ఇక్కడ అమ్ముతున్నామంటూ షాపు యాజమాన్యం సమాధానమిచ్చింది. మండల వ్యాప్తంగా పల్లెపల్లెలోనూ బెల్ట్ షాపులు ఉండడం వల్ల వైన్ షాపులో మూడు రోజులుగా మద్యం కొరత ఏర్పడడంతో దీనిని ఆసరాగా చేసుకొని మద్యం షాపు యాజమాన్యం మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తూ మద్యం ప్రియుల జేబులను కొల్లగొట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించి మద్యం అక్రమ అమ్మకాలు, అధిక ధరలకు విక్రయాలను, బెల్ట్ షాపులను నియంత్రించాలని పలువురు కోరుతున్నారు. దీనిపై స్థానిక ఎస్సై కిశోర్ వర్మను వివరణ కోరగా ఇప్పటికే డౌనూరులో 110 మద్యం బాటిళ్లు, ఆర్.కొత్తూరులో 160 బాటిళ్లు సీజ్ చేసి కేసులు పెట్టామని, బెల్ట్ షాపులు ఎక్కడ నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మనసు దోచే వలిసె పూల అందాలు

- ప్రత్యామ్నాయ పంటల వైపు గిరిజనుల చూపుతో పెరిగిన సాగు



బంధవీధి సమీపంలో విరబూసిన వలిసె పూజలు

ప్రజాశక్తి-సీలేరు

మన్యంలో వలిసె పువ్వుల అందచందాలు చూపరుల మనసును దోచుకుంటున్నాయి. జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ బంధవీధి గ్రామ సమీపంలో రైతులు సాగు చేసిన వలిసెలకు పువ్వులు విరబూశాయి. పసుపు వర్ణంలో ఉన్న ఈ పుష్పాలు సూర్యోదయం వేళ కాంతివంతమైన సూర్యకిరణాలు వికసించిన పుష్పాలపై పడడంతో అందాలు అపురూపంగా కనిపిస్తున్నాయి. మైదాన ప్రాంతం నుంచి వచ్చిన పర్యాటకులు, రెండు మూడు రోజులుగా జర్మనీ వాసులు మన్యం ప్రకృతి అందాలతో పాటు వలిసె సోయగాలను ఆస్వాదిస్తున్నారు. ఫొటోలను తమ కెమెరాల్లో బంధిస్తున్నారు. గంజాయి పంటకు స్వస్తిపలికి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలని పోలీసులు విస్తృతంగా ప్రచారం చేయడం మంచి ఫలితాలు ఇస్తున్నాయి. జీవనోపాధిని మెరుగుపర్చుకోవటానికి, ఆర్థికంగా బలపడడానికి గిరిజనులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించారు. ఈ ఏడాది బంధవీధిలో రైతులు సుమారు పది ఎకరాలకు పైగా వలిసె పంట సాగు చేశారు. అధికంగా దిగుబడులు కూడా వచ్చాయి.

సివిక్ యాక్షన్ ప్రోగ్రామ్‌కు సహకరించాలి

ప్రజాశక్తి -సీలేరు

సిఆర్‌పిఎఫ్ జి42 బెటాలియన్ ఆధ్వర్యంలో పైఅధికారుల ఆదేశాల మేరకు సివిక్ యాక్షన్ ప్రోగ్రామ్‌లు మారుమూల గిరిజన గ్రామాల్లో నిర్వహిస్తామని, వాటికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని స్థానిక ప్రజాప్రతినిధులకు సిఆర్‌పిఎఫ్ జి42 బెటాలియన్ డీఎస్పీ ఎ.సందీప్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. సిఆర్‌పిఎఫ్ జి42 బెటాలియన్ డీఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సందీప్‌రెడ్డి జీకే వీధి మండలం సీలేరు పోలీస్ స్టేషన్లో శుక్రవారం స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీలేరు పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టు కదలికలపై సమాచారం వస్తే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో సీలేరు ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి, సర్పంచ్ పాంగి దుర్గ, ఉపసర్పంచ్ కె.వల్లిప్రసాద్, కాంగ్రెస్ నాయకులు కారే శ్రీను, పంచాయతీ వార్డు మెంబర్ చిటికెల రాము తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఆర్‌పిఎఫ్ డిఎస్‌పి సందీప్ రెడ్డి

రోడ్డు నిర్మించాలని వినతి



వినతిపత్రాన్ని చూపుతున్న సిపిఎం నేతలు, గిరిజనులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:అల్లూరి జిల్లా అరకువేలి మండలం బస్కి పంచాయితీ గిన్నెగూడ నుండి డుంబ్రిగూడ మండలం కితలంగి పంచాయితీ పరశీల వరకు తారు రోడ్డు, బ్రిడ్జి నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేయాలని శుక్రవారం పాడేరు ఐటిడిఏ స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందజేసినట్లు సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, దేవరపల్లి బ్లక్షర్ పీసా కార్యదర్శి స్వామి. పొత్తి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ రహదారిలో రోజు వందలాది మంది ప్రయాణం చేస్తున్నారని, ఆదివాసి గిరిజనులు పండించిన పంటలు మార్కెట్లోకి తీసుకు రావాలంటే తీవ్ర సమస్యగా ఉంటున్నారు. ఈ రోడ్డు నిర్మాణం జరిగితే అరకువేలి, డుంబ్రిగూడ, అరకు మండలాల ప్రజలకు రవాణా సౌకర్యం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాము, కిల్లో బాలరాజు, హరికృష్ణ, వంతల అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

సెకీ ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలి

- ఇఆర్‌సి సలహా కమిటీ సభ్యుడు కాండ్రేగుల వినతి

ప్రజాశక్తి - సీతమ్మధార : విద్యుత్ వినియోగదారులకు భారం కానున్న 'సెకి' ఒప్పందాన్ని విద్యుత్ నియంత్రణ మండలి (ఇఆర్‌సి) తక్షణం రద్దు చేయాలని ఇఆర్‌సి రాష్ట్ర సలహా కమిటీ సభ్యులు కాండ్రేగుల వెంకటరమణ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎపిఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో జరిగిన ఇఆర్‌సి రాష్ట్ర సలహా కమిటీ సమావేశంలో ఛైర్మన్ ఠాకూర్ రామ్‌సింగ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ విం స్యుత్ వనరుల ప్రణాళికలో భాగంగా రాబోయే ఐదేళ్లలో 10,800 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్, 7 వేల మెగావాట్ల సెకి విద్యుత్ గ్రిడ్‌కు అనుసంధానం చేయడం వల్ల గ్రిడ్‌కు పునరుత్పాదక విద్యుత్ మిగులు పెరుగుతుందన్నారు. దీనివల్ల నిర్వహణ కష్టతరమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. 'సెకి'తో పిపిఎ కుదిరే నాటికి 'సెకి'-అదానీ మధ్య పిపిఎ లేదని, పిపిఎ లేని 'సెకి'తో పిఎస్ఎ ఎలా కుదుర్చుకుంటుందని వెంకటరమణ ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా అరిఇసిఎస్‌ల రద్దువుతున్న నేపథ్యంలో, కకింకోట, వీపురుపల్లి ఆరిఇసిఎస్‌లను యథావిధిగా ఐపిఇపిఎల్ పర్యవేక్షణలో కొనసాగించాలని కోరారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా 2020 జనవరి 13 నాటి తీర్మానానికి ఇఆర్‌సి కట్టుబడి ఉండాలని స్పష్టం చేశారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటుపై ఇఆర్‌సి, ఇంధనశాఖల భిన్నమైన ప్రకటనలతో వినియోగదారుల్లో అయోమయం నెలకొందని, దీనిపై స్పష్టతనివ్వాలని కోరారు. సిజిఆర్‌ఎఫ్‌లను పటిష్టం చేయాలని, ఫోరం తీర్పులను ప్రజలకు వివరించాలని, క్షేత్ర స్థాయిలో విద్యుత్ వినియోగదారుల సదస్సులు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఫుడ్ ప్రాసెసింగ్‌పై విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి -ఆనందపురం: మండలం, నెల్లిమ గ్రామంలోని కస్తూర్బా విద్యాలయంలోని ఇంటర్ విద్యార్థినులకు ఇంటర్న్‌షిప్‌లో భాగంగా ఫుడ్ ప్రాసెసింగ్‌పై శిక్షణ, స్టడీ టూర్ కార్యక్రమం నిర్వహించారు. గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి ఖలీషాబేగం, కళాశాల ప్రిన్సిపాల్ లావణ్య ఆధ్వర్యంలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులను ఆనందపురం మండలం వేములవలస జంక్షన్‌లోని బాలాజీ స్వీట్స్, బేకరీకి తీసుకువెళ్లి రొట్టె, కుకీస్, కేకులు, పేస్ట్రీ తయారీపై శిక్షణ, మెళకువలను నేర్పించారు. ఫుడ్ ప్రాసెసింగ్ వృత్తి ఉపాధ్యాయ స్వరాజ్యలక్ష్మి రొట్టె కేకులు ఎలా తయారుచేస్తున్నారో విద్యార్థినులకు వివరించారు. ఫుడ్ ప్రాసెసింగ్ శిక్షణ ద్వారా విద్యార్థినులు స్వయం ఉపాధికి అవకాశం ఉంటుందన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జెసి అభిషేక్ గౌడ్

ప్రజాశక్తి-పాడేరు: ఐటిడిఏలో శుక్రవారం నిర్వహించిన మీకోసం, ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థకు 37 ఫిర్యాదులు అందాయి. జాయింట్ కలెక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ్, డి. ఆర్. ఓ. కె. పద్మలత సంయుక్తంగా వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. స్వీకరించిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు అందజేసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్ మాట్లాడుతూ, రెవెన్యూ సదస్సులలో స్వీకరించిన ఫిర్యాదులను తహశీల్దారులు 40 రోజులలో పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో 80,401 అర్జీలను పరిష్కరించాల్సి ఉందన్నారు. అటవీ శాఖ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా అటవీ హక్కు పత్రాల జారీ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అదే విధంగా మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో వెబ్‌సైట్లో నమోదైన సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. హుకుంపేట మండలం ఎంపిటిసి మజ్జి హరి బాబ్జి వలస గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. పాడేరు మండలం చింతల వీధి పంచాయితీ నడింవీధి గ్రామానికి చెందిన కె.వరలక్ష్మమ్మ పి.ఎం. జన్మన్ లో ఇల్లు మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. అనంతగిరి మండలం ఎగువ శోభ పంచాయితీ బీసుపురం గ్రామంలో అక్రమంగా రిసార్టులు నిర్మిస్తున్నారని రిసార్టు నిర్మాణాలను నిలుపుదల చేయాలని పి.రవీంద్ర ఫిర్యాదు చేశారు. పాడేరు మండలం దోకులూరు పంచాయితీ తోటల గొంది వీధిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జమాల్ బాషా, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎల్. రజని, జిల్లా ఉద్యాన వన అధికారి ఎ.రమేష్‌కుమార్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్. నంద్, జిల్లా విద్యాశాఖాధికారి పి. బ్రహ్మాజీరావు, పాల్గొన్నారు.

కిదాంబి శ్రీకాంత్‌తో హండ్రెడ్ స్పోర్ట్స్ ఎంఓయు



ఒప్పంద సూచకంగా జెర్సీ చూపుతున్న శ్రీకాంత్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : అంతర్జాతీయ వేదికగా ప్రముఖ స్పోర్ట్స్ బ్రాండ్‌గా ప్రసిద్ధి చెందిన హండ్రెడ్ స్పోర్ట్స్ వరల్డ్ బ్యాడ్మింటన్ లెజెండ్, పద్మశ్రీ శ్రీకాంత్ కిదాంబితో తమ భాగస్వామ్యాన్ని ప్రకటించింది. శుక్రవారం బీచ్ రోడ్‌లోని నోవాటెల్ హోటల్‌లో హండ్రెడ్ స్పోర్ట్స్ సంస్థతో శ్రీకాంత్ కిదాంబి ఒప్పందాన్ని ప్రకటించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత బ్యాడ్మింటన్ మార్కెట్‌లో తమ బ్రాండ్ ఉనికిని బలోపేతం చేయాలనే లక్ష్యంలో భాగంగా హండ్రెడ్‌తో సహకారం భాగస్వామ్యం కీలకమైన అడుగుగా మారనుందన్నారు. ఈ భాగస్వామ్యం ప్రతిష్టాత్మక ఇండోనేషియా మాస్టర్స్ 2025లో అధికారికంగా ప్రారంభమౌతుందని, ఇది భావితరం ఔత్సాహిక బ్యాడ్మింటన్ క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తుందన్నారు. దేశంలో క్రికెట్ తర్వాత పాపులారిటీలో ఉన్న బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి, యువ ప్రతిభను పెంపొందించడానికి సహకరిస్తుందని అన్నారు.హండ్రెడ్ ఇండియా డైరెక్టర్ విశాల్ జైన్ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా బ్యాడ్మింటన్ మూలాలను మరింత ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశ్యం లో శ్రీకాంత్‌తో ఈ ఒప్పందం చేసుకున్నామన్నారు. భారతదేశంలో బ్యాడ్మింటన్ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు.

నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం

20 వరకూ నిర్వహణ



దుస్తులను ప్రదర్శిస్తున్న మహిళ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :నగర ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న నేషనల్ సిల్క్ ఎక్స్‌పో - ఎగ్జిబిషన్ కమ్ సేల్ - 2025 హోటల్ గ్రీన్ పార్క్‌లో శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈనెల 20 వరకు పండుగలు, వేడుకలను ఉత్సాహంగా జరుపుకోవడానికి ప్రదర్శనను అమ్మకాలను పూర్తి స్థాయిలో నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిరోజు ఉదయం 11 నుండి రాత్రి 9 గంటలు వరకు ఎక్స్‌పో ఉంటుందని, ప్రవేశం ఉచితంకాగా,. అన్ని డెబిట్, క్రెడిట్ కార్డ్‌లు అనుమతిస్తారు.

దేశంలోని వివిధ ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలు కలబోసిన వివిధ రాష్ట్రాలకు చెందిన మగ్గాల ఉత్పత్తులు అన్నింటిని ఒకే గొడుగు కిందకు చేర్చి, ఎక్స్ పోలో ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. దేశంలోని నేత సంప్రదాయాల చుట్టూ తిరిగి వచ్చిన అనుభూతిని ఇది కలిగిస్తుందన్నారు.దేశవ్యాప్త నేత కార్మికులు వేల రకాల సిల్క్, కాటన్ డిజైన్ వస్త్రాలు, డిజైనర్ బ్లౌజ్‌లు, కుర్తీలు వంటి తమ ఉత్పత్తులను 50 శాతం వరకు తగ్గింపుతో ఒకేచోట విక్రయిస్తున్నట్లు తెలిపారు.

మహారాష్ట్ర నుండి పైథాని సిల్క్ చీరలు, కర్ణాటక బెంగుళూరు సిల్క్, సాఫ్ట్ సిల్క్, కాషిదా సిల్క్ చీరలు, మధ్యప్రదేశ్ చందేరి, మహేశ్వరి సిల్క్ చీరలు, పశ్చిమ బెంగాల్ బలూచారి, జమ్దానీ, టాంగైల్, ఢకాయ్ మాస్లిన్ సిల్క్ చీరలు, లినెన్ శారీ కాంతా వర్క్ స్టిచ్ వస్త్రాలు మొదలైనవి ఎక్స్‌పోలో ఉంటాయన్నారు. ఇవేకాక ఎక్స్‌పోలో చీరలు, దుప్పట్లు,సల్వార్ మెటీరియల్‌లు వివిధ డిజైన్‌లు ఉన్నాయన్నారు.వీటిలో బీహార్‌కు చెందిన టస్సార్, మట్కా,భాగల్పూర్ సిల్క్ చీరలు,గుజరాత్ సాంప్రదాయ బంధిని,కచ్ ఎంబ్రాయిడరీ, పటోలా చీరలు,తమిళనాడు నుండి కంజీవరంతో పాటు ఎంబ్రాయిడరీ సిల్క్ చీరలు,కాశ్మీర్ జమ్ము, తాబీ సిల్క్ చీరలు ఉన్నాయన్నారు.

సందడిగా సంక్రాంతి సంబరాలు



థింసా నృత్యాన్ని చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మండలంలో సంక్రాంతి సంబరాలు మిన్నంటాయి. సంక్రాంతి పండగ సంబరాల్లో భాగంగా గ్రామాల్లో థింసా నృత్యాలు, షేర్ బుడియాల సందడితో పండుగ వాతావరణం నెలకొంది. బంధువుల సమక్షంలో తీపిని పంచుకుంటూ సంక్రాంతి సంబరాల్లో గిరిజనులు మునిగిపోతున్నారు. గ్రామాల్లో సంక్రాంతి సంబరాలతో గిరిజనులు ఆనందంగా గడుపుతున్నారు. ఉదయం శేరు బుడియాల సందడి, సాయంత్రం అయిదు నుంచి పది గంటల వరకు థింసా నృత్యాలను ప్రదర్శిస్తూ గిరిజనులు ఆనందంగా గడుపుతున్నారు. మండలంలో సంక్రాంతి సంబరాలతో గిరిజనులు ఉల్లాసంగా గడుపుతున్నారు.

విశాఖ, కిరండూల్ ప్యాసింజర్‌కు

అదనపు విస్టాడోమ్ కోచ్‌ల ఏర్పాటు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : పండుగ సీజన్‌లో వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న ప్రయాణికుల అదనపు రద్దీని క్లియర్ చేయడానికి, ఈస్ట్ కోస్ట్ రైల్వే విశాఖ, కిరండూల్ ప్యాసింజర్‌కు అదనపు విస్టాడోమ్ కోచ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో 58501 విశాఖపట్నం,కిరండుల్ ప్యాసింజర్ రైలుకు ఈనెల 18న ఒక విస్టాడోమ్ చైర్ కార్ కోచ్‌ను , 58502 కిరండుల్ - విశాఖపట్నం ప్యాసింజర్‌కు 19న ఒక విస్టాడోమ్ చైర్ కార్ కోచ్‌ను అదనంగా జతచేయనున్నట్లు తెలిపారు. ఈ సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ కోరారు.

క్రికెట్ టోర్నీ విజేత రైజింగ్ స్టార్స్

ప్రజాశక్తి -పద్మనాభం: మండలంలోని అయినాడ నిర్వహించిన గ్రామ పంచాయతీ స్థాయి క్రికెట్ టోర్నీలో రైజింగ్ స్టార్స్ జట్టు విజేతగా నిలిచింది. పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన ఏడు క్రికెట్ జట్లు ఈ పోటీల్లో పాల్గొనగా, ఆదివారం నుండి శుక్రవారం వరకు పోటీలు నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన ఫైనల్‌కు అయినాడకు చెందిన ఒరిజినల్ గ్యాంగ్, రేజింగ్ స్టార్స్ జట్లు చేరగా, తుదిపోరులో ఒరిజినల్ గ్యాంగ్‌పై రైజింగ్‌స్టార్స్ జట్టు గెలుపొంది విజేతగా నిలిచింది. విజేత రైజింగ్ స్టార్స్ జట్టుకు రూ.పదివేల నగదు బహుమతితోపాటు ట్రోఫీని, రన్నరప్ ఒరిజినల్ గ్యాంగ్ జట్టుకు రూ.ఐదు వేలు నగదు బహుమతిని టోర్నీ నిర్వాహకులైన గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకులు కురిమిన అనిల్‌కుమార్. కిషోర్ ప్రదానం చేశారు.

శ్రీకృష్ణదేవరాయల చరిత్ర నేటి పాలకులకు ఆదర్శనీయం

ప్రజాశక్తి -గోపాలపట్నం: విజయనగర సామ్రాజ్య చక్రవర్తిగా, ఆంధ్రభోజ్యుడిగా, సాహితీ సమరాంగన సార్వభౌమునిగా పేరుగాంచిన శ్రీకృష్ణదేవరాయలు నేటితరం పాలకులకు ఆదర్శనీయమని ఈస్ట్రన్ నేవల్ కమాండ్ కెటిబి అసోసియేషన్ గౌరవాధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షులు బత్తుల చిరంజీవి కొనియాడారు. శుక్రవారం ఎన్ఎడి కాకానినగర్‌లోని అసోసియేషన్ భవనంలో శ్రీకృష్ణదేవరాయలు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయల పరిపాలన నేటికి చరిత్రలో శాశ్వతంగా నిలిచి ఉందన్నారు. నేటి తరం పాలకులకు రాయల చరిత్ర ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి విజనగరి భాస్కరరావు, కార్యవర్గ సభ్యులు బిఎస్ నాయుడు, ఎస్. రమణ, సూర్య ప్రకాష్, కె. భాస్కర్ ప్రసాద్, జగదీశ్, గూడం కిరణ్ కుమార్, పలువురు నేవల్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



విద్యార్థినుల వసతి గృహాలను ప్రారంభిస్తున్న ధీరజ్ సింగ్ ఠాకూర్

లా విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్

ప్రజాశక్తి - సబ్బవరం : లా విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం కులపతి ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆదేశించారు. మండలంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. విశ్వ విద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం విశ్వవిద్యాలయ జనరల్ కౌన్సిల్ మీటింగ్ జరిగింది. సుమారు నాలుగు గంటల పాటు విశ్వవిద్యాలయంలో గడిపిన ధీరజ్ సింగ్ ఠాకూర్ వర్సిటీలోని వివిధ విభాగాల పనితీరును సమీక్షించారు. విద్యార్థులతో సంభాషిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నూతనంగా నిర్మించిన రెండు బాలికల వసతి గృహాలను ప్రారంభించారు. విద్యార్థుల భోజన సదుపాయాలను సమీక్షించి, వాటిని ఎలా మెరుగుపరచాలో తెలుపుతూ విద్యార్థుల మెస్ కమిటీ పని తీరును తెలుసుకున్నారు. విశ్వవిద్యాలయ అధికారులకు పలు సూచనలు చేశారు. హాస్టల్‌లోని ప్రతి అంతస్తును సందర్శించి బాత్ రూమ్‌లలో ఆధునిక ఫిట్టింగ్స్, వాషింగ్ మెషిన్, డ్రైయర్ లాంటి సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. విద్యార్థులు తమకు కల్పించిన సౌకర్యాలను సక్రమంగా ఉపయోగించుకోవాలని సూచించారు. విద్యార్థుల క్రీడా సౌకర్యాలను పరిశీలించి, అక్కడ నిర్మిస్తున్న ఇండోర్ ఆడిటోరియంను సందర్శించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి ఎన్.జయసూర్య, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ విశ్వచంద్రనాథ్ మాదాసు, చీఫ్ వార్డెన్లు భాగ్యలక్ష్మి, జోగినాయుడు, నాగేశ్వరరావు, షేర్లి తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణ విరమించుకోవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్‌కు రూ.11,440 కోట్లు ప్యాకేజీ ఇస్తున్నట్లు కేంద్రం ప్రకటించడంతో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగినట్టు కాదని సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, కంచరపాలెం జోన్ కార్యదర్శి బొట్టా ఈశ్వరమ్మ అన్నారు. ప్లాంట్ ప్రయివేటీకరణను నిలిపివేస్తున్నట్టు ప్రధాని మోడీ స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ వద్ద తలపెట్టిన రిలే దీక్షలు శుక్రవారానికి 1389వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక ప్యాకేజీ ప్లాంట్‌కు తాత్కాలిక ఉపశమనం మాత్రమేనని, శాశ్వతమైన పరిష్కారం కాదని అన్నారు. ప్లాంట్ ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే సొంత గనులు కేటాయించాలన్నారు. దీనిపై కేంద్రం ఎటువంటి నిర్ణయమూ ప్రకటించలేదన్నారు. సెయిల్‌లో విలీనం చేయడం ద్వారా విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఒక బలమైన సంస్థగా ఎదుగుతుందన్నారు. దీనిపై కూడా కేంద్రం ఎటువంటి నిర్ణయమూ ప్రకటించలేదన్నారు. దీక్షల్లో గొలగాని అప్పారావు, ఎ.నూకేశ్వరరావు, భానుమూర్తి, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వింటర్ స్టడీ టూర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉత్తరాఖండ్ రాష్ట్రం ముస్సోరిలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌కు చెందిన 2024 బ్యాచ్‌లోని 38 మంది ట్రైనీ ఐఎఎస్ అధికారులు ఈ నెల 9 నుంచి రెండు బృందాలుగా తూర్పు నౌకాదళ కమాండ్‌లో చేపట్టిన వింటర్ స్టడీ టూర్ ముగిసింది. వారంతా నావికాదళ కార్యకలాపాలను పరిశీలించారు. భారత నావికాదళం ఆపరేషనల్ కమాండ్ల పాత్రలను, బాధ్యతలను అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా ఇక్కడి అధికారులు ఇండియన్ నేవీలో ఈస్టర్న్ నేవల్ కమాండ్ పాత్ర, బాధ్యతలపై శిక్షణార్థులకు ఇంటరాక్టివ్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

పట్టుబట్టాలి

- బల్క్ డ్రగ్ పార్కు రద్దుకు తీర్మానం చేయాలి
- నేడు జిల్లా పరిషత్ సమావేశం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

శనివారం జరిగే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో రెండు ప్రధానాంశాలపై చర్చ జరగనుంది. ఈ నెల 8న విశాఖపట్నం నుంచి ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్‌లో అచ్యుతాపురం మండలం పూడిమడక వద్ద ఎన్‌టిపిసి గ్రీన్ హైడ్రోజన్ హబ్, నక్కపల్లి మండలంలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు చేసిన శంకుస్థాపనపై ప్రజల్లో నెలకొన్న భయాలు, అనుమానాలపై సభ్యులు ప్రశ్నలు లేవనెత్తనున్నారు. మత్స్యకారులు, ప్రజలు తమ జీవనోపాధిని, ఆరోగ్యాలను దెబ్బతీసే బల్క్ డ్రగ్ పార్కును రద్దు చేయాలని కొంతకాలంగా ఆందోళన చేస్తున్నారు. రాజయ్యపేటలో రాజకీయాలకు అతీతంగా బల్క్ డ్రగ్ పార్కును ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. కానీ రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, ఎంపీ సిఎం రమేష్ మౌనందాల్చుతున్నారు మత్స్యకారులు, ప్రజల భయాలను తొలగించడంలేదు. ప్రజలు వద్దనుకున్న పని చేయబోమని చెప్పడంలేదు. 2001 ఎకరాల్లో ఏర్పాటు చేయబోయే బల్క్ డ్రగ్ పార్కు శంకుస్థాపనకు ముందు చేయాల్సిన చట్టపరమైన ప్రక్రియలేవీ చేపట్టలేదు. పర్యావరణ నిబంధనలు పాటించలేదు. బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుపై పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక (ఇఐఎ) తయారు చేయాల్సివుంది. ప్రజాభిప్రాయసేకరణ నిర్వహించాల్సివుంది. నీటిపారుదల, అటవీశాఖ, కాలుష్య నియంత్రణ మండలి నుంచి ఎన్‌ఒసిలు ఇవ్వాల్సివుంది. ఈ పద్ధతులేవీ పాటించకుండా, ప్రజల అభిప్రాయాలను తీసుకోకుండా వారికి ప్రాథమిక సమాచారం ఇవ్వకుండా బల్క్ డ్రగ్ పార్కుకు శంకుస్థాపన చేయడంపై మత్స్యకారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

దాదాపు 120 ఎకరాల విస్తీర్ణంలోని హెటిరో డ్రగ్ కంపెనీ సముద్రంలోకి విడిచిపెడుతున్న రసాయన వ్యర్థాలతో మత్స్యకారులు బతుకులు ఇప్పటికే దెబ్బతిన్నాయి. సముద్రంలో చేపల ఉత్పత్తి తగ్గడంతో వేటలేక జీవనోపాధి కోసం వలసలు పోతున్నారు. అటువంటిది 2001 ఎకరాల విస్తీర్ణంలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటైతే తామిక్కడ బతకలేమని, వేట పూర్తిగా పోతుందని, రోగాలపాలవుతామని రాజయ్యపేట సహా పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇఐఎ నివేదిక లేకుండా, ప్రజాభిప్రాయసేకరణ నిర్వహించకుండా బల్క్ డ్రగ్ పార్కు శంకుస్థాపన ఎలా చేస్తారన్న స్థానిక మత్స్యకారులు, ప్రజల ప్రశ్నకు పరిశ్రమలు, కాలుష్య నియంత్రణ మండలి అధికారుల నుంచి సరైన సమాధానం లేదు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు వాస్తవాలు చెప్పకపోవడంతో మత్స్యకారుల్లో మరింత భయం పెరుగుతోంది. ఇది నక్కపల్లి మండలానికే పరిమితమైన సమస్య కాకపోవడంతో తీరప్రాంతంలోని పాయకరావుపేట, ఎస్.రాయవరం, రాంబిల్లి, అచ్యుతాపురం, పరవాడ మండలాల్లోని ప్రజలూ కాలుష్య పరిశ్రమల రాకతో తీవ్రమైన ఆందోళనకు గురవుతున్నారు. తీర ప్రాంతంలోని ఈ మండలాలు పాయకరావుపేట, యలమంచిలి, పెందుర్తి నియోజకవర్గాలకు విస్తరించివున్నందున ఆ నియోజకవర్గ ఎమ్మెల్యేలు స్పందించాల్సివుంది. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ సుభద్ర అధ్యక్షతన శనివారం జరగనున్న జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో ప్రాతినిధ్య ప్రాంతాలకు, పార్టీలకు అతీతంగా జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు బల్క్ డ్రగ్ పార్కు రద్దుపై జిల్లా పరిషత్‌లో తీర్మానం చేసి ప్రజల ఆకాంక్షలు, అభిప్రాయాలను గౌరవించాలి.

నేడు 2025-26 బడ్జెట్

జిల్లా పరిషత్ 2024-25 సవరణ బడ్జెట్, 2025-26 సంవత్సర అంచనా బడ్జెట్ శనివారం జిల్లా పరిషత్ సమావేశంలో ప్రవేశపెట్టనున్నారు. దీనికి ముందు స్థాయీ సంఘం ఆమోదం పొందనుంది. బడ్జెట్ ఆమోద అనంతరం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో వ్యవసాయ, విద్య, సంక్షేమ శాఖలపై సమీక్షపై చర్చ జరగనుంది.

పూర్తి నివేదికలతో రండి
జెడ్‌పి సిఇఒ నారాయణమూర్తి

విశాఖ కలెక్టరేట్ : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన శనివారం జెడ్‌పి సమావేశ మందిరంలో జరగనుందని, ఈ మేరకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి పి.నారాయణమూర్తి తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని విభాగాల అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. సర్వసభ్య సమావేశం ఉదయం 10.30 గంటల నుంచి సమావేశ మందిరం వేదికగా కొనసాగుతుందని, సభ్యులు, అధికారులు భాగస్వామ్యమై విజయవంతం చేయాలని కోరారు.

అలాగే ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఆమె ఛాంబర్ సమీపంలోని విసి. హాలులో, జెడ్‌పి సమావేశ మందిరంలో ఒకటి నుంచి ఏడు వరకుగల స్థాయీ సంఘ సమావేశాలు వేర్వేరుగా ఉదయం నుంచి నిర్దేశిత సమయాల్లో జరుగుతాయని చెప్పారు. ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, ఎంపిపిలు, అధికారులు సమావేశాలకు హాజరుకావాలని కోరారు.

మల్టీలెవెల్ కార్ పార్కింగ్ పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విఎంఆర్‌డిఎ అత్యంత ప్రతిష్టాత్మకంగా రూ.80 కోట్ల నిధులతో సిరిపురం జంక్షన్‌లో నిర్మిస్తున్న మల్టీలెవెల్ కార్ పార్కింగ్ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను మెట్రోపాలిటన్ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అయన అసంపూర్తిగా ఉన్న పనులను గుర్తించి ఎక్కువ మంది కార్మికులను నియమించుకుని, అన్ని పనులనూ జనవరి నెలాఖరుకు పూర్తి చేసి ఫిబ్రవరి మొదటి వారంలో ప్రారంభోత్సవానికి సిద్ధం చెయ్యాలని అధికారులను, గుత్తేదారు సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. అంతేకాకుండా సోమవారం మరొకసారి పెండింగ్ పనులపై సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. క్షేత్ర స్థాయి పర్యటనలో ప్రధాన ఇంజినీర్ భవానీ శంకర్, సూపరింటెండింగ్ ఇంజినీర్ బలరామరాజు, కార్యనిర్వాహక ఇంజినీర్లు మధుసూదన్, రామరాజు పాల్గొన్నారు.

'జివిఎంసిలో లోడర్ కాంట్రాక్టర్ దోపిడీ'

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసిలో లోడర్ కాంట్రాక్టర్ పెద్ద ఎత్తున దోపిడీకి పాల్పడుతున్నారని, దీనిని అరికట్టవలసిన అధికారుల చోద్యం చూస్తున్నారని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు పి.వెంకట రెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంట్రాక్టర్ దోపిడీకి అంతు లేకపోవడం వల్లనే కార్మికులు ఆందోళనలు చేస్తున్నారన్నారు. లోడర్స్ లేబర్ కాంట్రాక్టు ఒప్పందం చెల్లదని తెలిపారు. పిఎఫ్, ఇఎస్ఐ లేకుండా ఈ కాంట్రాక్టును కౌన్సిల్ ఎలా ఆమోదించిందని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న పిఒ కట్టా సింహాచలం

మలేరియా నిర్మూలనకు ముందస్తు చర్యలు

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీలోని పూర్తిస్థాయిలో మలేరియా నిర్మూలించే విధంగా ముందస్తు చర్యలు చేపట్టడం జరుగుతుందని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యాధికారులు, సబ్ యూనిట్ అధికారులు, ఏఎంఓ, గ్రామ సచివాలయాల ఎఎన్‌ఎంతో మలేరియా నిర్మూలనపై శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో పిఒ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం మలేరియా పూర్తిస్థాయిలో నిర్మూలించే విధంగా ప్రతి గ్రామంలో ముందస్తు యాక్షన్ ప్లాన్ తయారు చేసి సమర్పించాలని ఆదేశించారు. ఫీవర్ కేసులు సంభవించకుండా ఎప్పటికప్పుడు డోర్ టు డోర్ సర్వే చేయాలని సూచించారు. పిహెచ్‌సిల నుండి రంపచోడవరం, కాకినాడ, రాజమండ్రి రిఫరల్ కేసులు సంబంధిత ఎఎన్‌ఎంలు ఎప్పటికప్పుడు ఫాలోఅప్ చేయాలన్నారు.

పిహెచ్‌సిలకు జ్వరాలతో వచ్చిన వారికి వెంటనే రక్త నమూనాలు సేకరించి, వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా మందులు అందజేయాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు గిరిజన ఆశ్రమ, ప్రభుత్వ పాఠశాలలను వైద్యాధికారులు సందర్శించి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. పిహెచ్‌సిల్లో బర్త్ వెయిటింగ్ హాల్‌కు డెలివరీకి వచ్చిన గర్భిణులను వైద్యాధికారులు పర్యవేక్షించాలని కోరారు. పిహెచ్‌సిల్లో ఓపీలను పెంచాలన్నారు. ఈనెల 20వ తేదీ నుండి లెప్రసీ కేసులు గుర్తించేందుకు ఏడు మండలాల్లోని అన్ని గ్రామాలలో సర్వే నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎడిఎంహెచ్ఓ డాక్టర్ శిరీష, రంపచోడవరం, అడ్డతీగల, వై.రామవరం ఆసుపత్రుల సూపరింటెండెంట్లు డాక్టర్ శేషారెడ్డి, డాక్టర్ రాహుల్, డాక్టర్ సతీష్, సిడిపివోలు సంధ్యారాణి, లక్ష్మీ ప్రసన్న, లక్ష్మి, ఏఎంఓ రాజు, ఎంపిహెచ్ఓ పీటర్, అన్ని పిహెచ్‌సిల వైద్యాధికారులు, సబ్ యూనిట్ అధికారులు, గ్రామ సచివాలయాల ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

నేడు ఎన్‌టిఆర్ వర్ధంతిని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-విఆర్.పురం : మాజీ ముఖ్యమంత్రి, టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు 29వ వర్ధంతి కార్యక్రమం మండలంలోని రేఖపల్లి జంక్షన్లో శనివారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల కార్యదర్శి బురక కన్నారావు శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు. టిడిపి కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

సాయుధ దళాల పతాక నిధి

విరాళాల సేకరణలో విశాఖకు ప్రథమ స్థానం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సాయుధ దళాల పతాక దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని పతాక నిధికి చేపట్టిన విరాళాల సేకరణలో విశాఖపట్నం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పిలుపునందుకొని పలు సంస్థలు, అధికారులు, సామాజిక కార్యకర్తలు స్వచ్ఛందగా ముందుకు వచ్చి రూ.24..48 లక్షల విరాళం అందజేశారు. రాష్ట్రంలో విశాఖపట్నం జిల్లా ప్రథమ స్థానంలో నిలవగా రాష్ట్ర గవర్నర్ జిల్లాకు ట్రోఫీ, ధ్రువీకరణ పత్రాన్ని బహుకరించారు. సంబంధిత ట్రోఫీని, పత్రాలను జిల్లా సైనిక సంక్షేమ అధికారి జి.సత్యానందం తన కార్యాలయ సిబ్బందితో కలిసి శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు ఆయన ఛాంబర్‌లో అందజేశారు. కార్యక్రమ విశేషాలను వెల్లడించారు. పతాక నిధికి విరాళాలు అందించిన స్వయం సహాయక సంఘాల సభ్యులకు, మాజీ సైనిక సంఘాల సభ్యులకు, జిల్లా పౌరులకు, సామాజిక కార్యకర్తలకు జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారిని, ఇతర సిబ్బందిని అభినందించారు.